
# హలో! హలో!!



—నగరూరు అనసూయ

ట్రింగ్ - ట్రింగ్ ... అని ఫోను మోగుతూనే వుంది. ఫోనుకు దగ్గరగా సీట్లో కూర్చున్న ప్రియంవద మాత్రం తనకేమీ పట్టనట్లుగా కూర్చుని వుంది.

ఆమెకు ఆ ఫోను మోతంటేనే ఒక రకమైన చిరాకు. ఆమెకు కొద్ది దూరంలో కూర్చున్న లక్ష్మి వెళ్ళి ఫోన్ కాల్ రిసీవ్ చేసుకుంది. హాయిగా వూపిరి పీల్చుకుంది ప్రియంవద. ఆమె పని చేస్తున్నది ఒక ప్రైవేట్ ఫైనాన్స్ కార్పొరేషన్.

ప్రియంవదకు ఎందుకో చిన్నతనం నుంచి ఫోన్ అంటే చెప్పలేని భయం. తాను ఆఫీసులో చేరక మునుపు ఎన్నడూ దానిని వుపయోగించ లేదు. ఎన్నోసార్లు ఫోను అందుకోవాలనుకుంటుంది కాని తాను పొరపాటున చెవిలో పెట్టుకోబోయే భాగాన్ని నోటివద్ద పెట్టుకుంటానేమోనన్న భయం, సరిగ్గా పెట్టుకున్నా అవతలి నుండి మాటలు స్పష్టంగా తన చుట్టుపక్కల వారు గమనించి చాటుగా నవ్వుకుంటారేమోనన్న భయం - ఇన్ని అర్థంలేని భయాలు ఆమెను బలహీనురాల్ని చేశాయి.

లక్ష్మి ప్రియంవద వద్దకు వచ్చింది. "అంతగా ఫోను మోగుతున్నా చలనం లేకుండా కూర్చుంటావే, వెళ్ళి మాట్లాడరాదూ" చనువుతో అడిగింది. సమాధానంగా చిరునవ్వు నవ్వి వూరుకుంది ప్రియంవద.

ఒకసారి ఆమె స్నేహితురాలు రమ హైదరాబాద్ నుంచి ట్రంకాలు చేసింది. అలవాటులేని ప్రియంవద హైదరాబాద్ నుంచి ట్రంకాలు అనగానే అక్కడ వున్న తన అక్కా బావలు ఏమయ్యారోనని కంగారు పడింది. ఫోన్ అనగానే భయం, ట్రంకాలులో మాటలు తగ్గు స్వరంలో వినబడడంతో ఎవరు ఫోను చేసిందీ మొదట ఆమెకు అర్థం కాలేదు. ఏదో విసుగుతో మాట్లాడింది. మరి ఆ రమకు ఏమి అర్థమైందోగానీ, రమ ఆమెతో పూర్తిగా తెగ తెంపులు చేసుకుంది. ఎన్ని వుత్తరాలు రాసినా జవాబే ఇవ్వలేదు. అంత కష్టపడి, డబ్బు ఖర్చుపెట్టి ట్రంకాలు చేస్తే రమ ఆమె ఇలా ప్రవర్తించిందని ఆమెకు కోపం.

ప్రియంవద ఎన్నోసార్లు రమ భయాన్ని పోగొట్టుకుని అందరిలా ప్రవర్తించా లనుకుంటుంది. కానీ ఆమెకు అది సాధ్యపడడం లేదు.



కొన్ని నెలలు గడిచాయి. ప్రియంవదకు పెండ్లి నిశ్చయమైంది. ఒకనాడు విజయవాడ నుంచి ట్రంక్ కాల్ వచ్చింది. విజయవాడలో ఎవరున్నదీ తనకు బాగా తెలుసు. అయినా, తాను ఆఫీసులో లేనని చెప్పమని లక్ష్మికి చెప్పింది. వ.

రుసగా రెండు మూడు రోజులు ఆమె కాబోయే భర్త శేఖర్ ఫోను చేశాడు. ప్రియంవద ఆఫీసులో లేదని సమాధానం వచ్చింది. ఆమె ఆఫీసుకు వరుసగా మూడు రోజులు రాలేదంటే ఆమెకు ఆరోగ్యం బాగు లేదేమోనని శేఖర్ కంగారు పడ్డాడు. మరునాడే ప్రియంవద వున్న వూరికి ప్రయాణమయ్యాడు. తిన్నగా ఆఫీసుకు వచ్చి ప్రియంవదను కలుసుకున్నాడు. "ఏం మేడమ్, మూడు రోజులు ఫోను చేస్తే మీరు లేరనే రిప్లై వచ్చింది" కొంటెగా అడిగాడు. ఇక దాచి ప్రయోజనం లేదనిపించింది ప్రియంవదకు.

"చూడండీ! ఏదైనా అవసరమైన విషయముంటే ఫోన్‌లో చెబితే ఫోన్ కాల్ అందుకున్నవారు నాకు చెబుతారు గదా. నేను లేను అనగానే ఫోన్ పెట్టేస్తారెందుకు? నాకు ఫోను అంటే భయం" చెప్పింది ప్రియంవద.

శేఖర్‌కు కళ్ళ ముందు సినిమా రీళ్ళు కదిలాయి. ఇంచు మించు ప్రతి సినిమాలోనూ పెండ్లి కాక మునుపు హీరో హీరోయిన్‌కు ఫోన్ చేస్తాడు. టిప్పు సుల్తాన్ టీ కప్పు మొదలు ఇంగ్లండు రాకుమారుని పెండ్లినాటి చెప్పుల వరకు అన్ని విషయాలు మాట్లాడుతాడు. కొన్ని సినిమాలలో అయితే మరీ - హీరో ఫోన్ చేస్తాడు. హీరోయిన్ ఫోన్ అందుకుని 'హల్లో' అంటుంది. హీరో బదులు మాట్లాడకుండా ఆమె కంఠ మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ వుంటాడు. ఆమె అదే విధంగా 'హల్లో-హల్లో' అంటూ వుంటుంది. శేఖర్ సగటు మనిషి. నేటి సినిమాల ప్రభావం అతడిపై లేకుండా ఎలా వుంటుంది?

అసలు ఈ ప్రియంవద ఉద్దేశమేమిటి? 'ప్రియా, ఐ లవ్ యూ' అని తానుఫోను చేయాలనుకున్నాడు. "లక్ష్మిగారూ నేను ప్రియను లవ్ చేస్తున్నానని ఆమెకు చెప్పండి" అని తాను లక్ష్మికి ఫోన్ చేయాలా!

అందుకే అన్నాడు ప్రియంవదతో "చూడు. ప్రియంవదా! నీ పేరుకేమో ప్రియమైన పలుకులు పలుకునది అని అర్థం. నీవు ఫోన్ చూసి భయపడి మౌనంగా వుంటే ఎలా? సరే నేను రేపు సాయంత్రము దాకా ఈ వూళ్ళో వుండాలనుకున్నాను. నేను రేపు వుండేదీ, లేనిదీ తెలియాలంటే నా లాడ్జి నెంబరుకు ఫోన్ చేయి" అంటూ ఫోను నెంబరు ఇచ్చాడు.

## సృష్టి విద్య

ప్రకృతిలో గలట్టి ప్రతి రజఃకణమును
నియమ నిష్ఠతో నెగడుచుండు
మానవుండుతాను జ్ఞానంబు నార్జించి
ఎచటికేగునదియు నెరుగకుండు!

చిగురుటాకు జూచి చివ్వారి కోకిల
పరవశించి పాట పాడుచుండు
నరుని చూచి నరుడు నానా విధంబుల
చిత్రహింస చేసి చెలగుచుండు!

అతనుడలరివింటెనందుకొన్నంతనే
పూల గుండెలలరి పులకరించు
మానవతకు గుండె మంటలు రగిలించి
నరుడు నవ్వునది ఘనంబటంచు!

కల్లలెరుగనట్టి మల్లెలు విరబూసి
తావులొసగు జీవత తుదకెల్ల
తోడివాని కీర్తి తోరణంబులు త్రుంచి
మానవుండు దురభిమానియగును!

ఓ యుగాధిపా! మహోర్విసమస్తంబు
సంగరంబు దెసకు సాగుచుండె
నిట్టి తరుణమందునే తెంచుచున్నావు
బ్రతుకుగాక శాంతి పావురంబు!

—ఎం.పి.జానుకవి

ప్రియంవదకు గుండెలో గుండ్లు పేలినట్లయింది. ఇంకా ఏమైనా మాట్లాడితే శేఖర్‌కు కోపం వస్తుందని మౌనంగా వుండి పోయింది.

మరునాడు లక్ష్మిని అడిగి నెంబరు డయలు చేయించింది. భయంతో ఫోను అందుకుంది. "హల్లో రాజవిహార్ లాడ్జింగ్ కదండి" అడిగింది. "కాదమ్మా రవి చెప్పుల షాపు" బదులు వచ్చింది. 'సారీ రాంగ్ నెంబరు' అంటూ ఫోన్ పెట్టేసింది. మళ్ళీ లక్ష్మి డయలు చేసి ఇచ్చింది. ఈసారి కరెక్టుగానే కనెక్షన్ వచ్చింది. శేఖర్‌ను పిలిచింది. హలో ప్రియా, ప్రియా అంటూ ఫోను అందుకున్నాడు శేఖర్. అతనికి చాలా సంతోషంగా వుంది.

"ఏమండ, మీరు ఊర్లోనె వున్నారు కదూ. సాయంత్రం ఇంటికి వస్తారా. అక్కడి నుండి సాయిబాబా గుడికి వెళ్దాం" అడిగింది ప్రియంవద. "అలాగే" అన్నాడు శేఖర్. కొద్ది సేపు మాట్లాడి, ఫోన్ పెట్టేసాడు శేఖర్. లైన్ కట్ అయినట్టనిపించింది ప్రియంవదకు. అంతలో 'హలో మేడమ్' అంటూ ఏదో మగ గొంతు వినిపించింది. శేఖర్ గొంతు కాదని గుర్తించింది ప్రియంవద. "సాయంత్రం ఎన్ని గంటలకు ఇంటికి రమ్మంటారు?" ఆ గొంతులో వెకిలితనం. కోపంతో ఫోను పెట్టేయ బోయిన ప్రియంవదకు వెంటనే ఏదో గుర్తుకు వచ్చింది. ఆ గొంతు టెలిఫోన్ ఆపరేటర్‌ది అయి వుంటుందని గ్రహించింది. ఆసక్తిగా యితరుల విషయాలు విని వాళ్ళను ఆటపట్టించడం కొందరు టెలిఫోన్ ఆపరేటర్ల అలవాటు. మళ్ళీ 'హలో' అని పలకరించింది ప్రియంవద. తనకు బదులు యిచ్చిందని సంతోష పడిపోయాడు ఆ ఆపరేటర్. "చదువుకున్న అడ్డగాడిద, సిగ్గు లేదా" అంటూ తనకు వచ్చిన అన్ని భాషా తిట్లతో అతన్ని తిట్టి, గట్టిగా ఫోన్ పెట్టేసింది ప్రియంవద. చేయక, చేయక ఫోన్ చేస్తే ఇలాంటి వాడు తగల బడ్డాడేమని బాధ పడింది.

సాయంత్రం ఇంటికి వెళ్లే ముందు వాళ్ల ఆఫీసర్ ఆమెను పిలిపించాడు. తాను వారం రోజులు సెలవుపై వెడుతున్నానని చెప్పి, ఆమె చేయవలసిన పనులు ఆమెకు అప్పగించాడు. రెండు, మూడు కంపెనీలకు ఫోను చేయవలసి వుంది. "మీరు చేయగలరా" నవ్వుతూ అడిగాడు ఆయన. 'చేయగలను' అని ధైర్యంగా చెప్పలేక పోయింది ప్రియంవద. ఆయన మరో ఉద్యోగికి ఆ పని అప్పగించాడు.

ప్రియంవద ఈ విషయమై చాలా బాధ పడింది. తను అన్ని పనులూ మంచి సామర్థ్యంతో చేయగలదు. అయినా ఈ ఒక్క ఫోను వల్లనే తాను యిన్ని అవమానాలు ఎదుర్కోవలసి వస్తోంది. ఈ ఫోన్‌ని ఎవరు కనిపెట్టారో గానీ అదిప్పుడు తనను అనుక్షణం చంపుకుతింటోంది. అసలు కర్నాటకలో స్థిరమైన హెగ్డే ప్రభుత్వం కూలి పోవడానికి ఈ ఫోనే కారణం!' ఫోనులో నీ కోసం టైం బాంబు పెట్టారా, అలా భయపడతావు?" అంటుంది లక్ష్మి. ఎవరెంతగా చెప్పినా తిట్టినా తనకు భయం తగ్గడం లేదు. అయినా అది తన తప్పు కాదు. తనకు బడిలో కాలేజీలో కూడ ఈ ఫోను చేయడం, రిజిస్టరు పోస్టు చేయడం లాంటివి నేర్పలేదు. ఈ మధ్యే పేపరులో తాను ఒక వార్త చదివింది. ఏమంటే ఒకామెను దొంగలు కాళ్ళు చేతులు కట్టివేస్తే, ఆమె ముక్కుతో ఫోను డయల్ చేసి పోలీసులను పిలిపించిందట. నేను కూడా ఆ స్థితికి చేరు

పటిష్టమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్

కుంటాను. చూడండి' అని సాహస ప్రతిజ్ఞ చేసుకుంది ప్రియంవద.

ప్రియంవద, శేఖర్‌ల పెండ్లి జరిగిపోయింది. శేఖర్ ప్రియంవద వున్న వూరికే బదిలీ చేయించుకున్నాడు. శేఖర్ కోరుకున్న అన్ని సుగుణాలూ, అలవాట్లూ ప్రియంవదలో వున్నాయి. (ఒక్క ఫోను చేయడం తప్ప). ఆమెకు ఆ విద్య నేర్పాలని శేఖర్ ప్రయత్నిస్తున్నాడు. అలాగే ఒక సంవత్సరం గడిచిపోయింది.

"ఇవ్వాళ మన పెండ్లి రోజు కదా. మా చిన్నాన్న వాళ్ళని భోజనానికి పిలవాలి. మన ఇద్దరికీ ఆఫీసులు వుండడంతో ఇంటికి పోయి పిలవడానికి వీలు కాదు. నువు ఆఫీసుకు వెళ్లాక, ఫోను ద్వారా ఈ విషయం పిన్నీ వాళ్లకి చెప్పు" అంటూ వాళ్ల ఫోను నెంబర్ యిచ్చాడు శేఖర్. ప్రియంవద భద్రంగా అందుకుంది.

సాయంత్రం పిన్నీ, చిన్నాన్న రాగానే చాల సంతోషపడ్డాడు శేఖర్ (వాళ్ల రాక కంటె, ప్రియంవద ఫోన్ చేసి పిలిచినందుకు.)

మాటల మధ్యలో పిన్ని చెప్పింది. ''ప్రియంవద, ఎంత మంచి పిల్లరా శేఖర్. నీవు ఫోను చేసి, మమ్మల్ని పిలవమని చెప్పినా, ఆ అమ్మాయి మా కోసం ఆఫీసులో పర్మిషను తీసుకుని, వచ్చి, మరీ పిలిచింది. ఎంత సంస్కారం గల పిల్ల!''

గాలి తీసిన బెలూన్ అయ్యాడు శేఖర్. అయినా, ఏం చేస్తాడు? తర్వాత రెండు రోజులకు ఉదయం న్యూస్ పేపర్ చదువుతూ చెప్పాడు శేఖర్ ''ప్రియంవదా. ఈ సారి బడ్జెట్‌లో టెలిఫోన్ రేట్లు పెంచారు. ఇక నుండి, హలో ప్రియా ప్రియా అని కాక హలో ప్రియం ప్రియం' అని ఫోన్ చేయాలి.

'' మంచి పనే చేసారు లెండి. అనవసర ఫోన్ కాల్స్ తగ్గిపోతాయి.'' ఊపిరి పీల్చుకుంటూ అంది ప్రియంవద.

ఆ రోజు సాయంత్రం ఇంటికి రాగానే ప్రియంవదా, నీకొక గుడ్ న్యూస్ అంటూ ఒక కవరు చేతికి అందించాడు శేఖర్. ఆశ్చర్యపోతూ తీసి చదివింది ప్రియంవద. టెలిఫోన్ ఆపరేటర్‌గా ఆమెకు ఉద్యోగం వచ్చింది. కర్మకాలి ఈ ఉద్యోగమే రావాలా! ఎప్పుడో ఇంటరు పాస్ అవ్వగానే తాను ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజిలో తన పేరు నమోదు చేసింది. ఇన్ని సంవత్సరాలకు దాని ద్వారా తనకు ఒక ఉద్యోగమంటూ వచ్చింది.

'' ఇప్పుడేం చేస్తావు డియర్! గవర్నమెంట్ ఉద్యోగం వదలుకుంటావా'' నవ్వుతూ అడిగాడు శేఖర్. ప్రియంవద బదులు చెప్పలేదు.

ప్రియంవద ఉద్యోగంలో చేరి నెల అయింది. ఒక రోజు శేఖర్‌తో అంది. ''ఏమండీ, నేను అనవసరంగా ఫోన్ అంటే భయపడి; ఎందరినో బాధ పెట్టాను. నేనూ నవ్వుల పాలయ్యాను. నిజానికి అది ఏమీ అంత భయపడవలసిన విషయం కాదండి.''

'' అవును ప్రియంవదా, బలహీనతలనేవి మనుష్యులకు తప్పకుండా వుంటాయి. వాటిని అధిగమించడం నేర్చుకోవాలి. ఒక్కొక్కసారి చిన్నచిన్న బలహీనతల వల్ల పెద్దపెద్ద అవకాశాలనూ మధురమైన అనుభూతులనూ కోల్పోవడం జరుగుతుంది'' అన్నాడు శేఖర్.

మరునాడు టెలిఫోన్ ఆఫీసులో వున్న ప్రియంవదకు ఫోన్ చేసాడు. ఆమె హల్లో హల్లో అంటోంది. ఆమె స్వర తరంగాలు, విద్యుత్తరంగాలుగా మారి టెలిఫోన్ ద్వారా శేఖర్ చెవిని చేరి గిలిగింతలు పెట్టసాగాయి. ●


## ఆంధ్రప్రదేశ్‌లో వినూత్న ప్రగతి



* 20 సూత్రాల కార్యక్రమం ముమ్మరంగా అమలు
* మత సామరస్యం పునరుద్ధరణ
* షెడ్యూలు తెగలను వ్యవసాయం, ఉద్యానవన కార్యక్రమాలలో స్థిరపరిచేందుకు రూ. 77 కోట్ల ఖర్చుతో నవోదయ పథకం
* రూ. 117 కోట్ల ఖర్చుతో ముమ్మరంగా మారుమూల ప్రాంతాల అభివృద్ధి పథకం అమలు
* రూ. 100 కోట్ల ఖర్చుతో రోడ్లకు మరమ్మతు కార్యక్రమాలు.
* విద్యుత్ పథకాలకు, సేద్యపునీటి పథకాలకు ఇతోధిక ప్రాధాన్యం
* హైదరాబాద్‌లోని గచ్చీ బౌలిలో ప్రభుత్వోద్యోగుల కోసం ఉద్యోగనగర్
* ఇళ్ళ సంఖ్య, ఇళ్ళ స్థలాల కేటాయింపు, ముఖ్యంగా బలహీనవర్గాల వారి కోసం గణనీయంగా పెంపుదల
* కాలుష్యరహిత పారిశ్రామికీకరణ
* రూ. 38 కోట్ల ఖర్చుతో పారిశ్రామిక వినియోగానికి చెట్ల పెంపకం
* స్వల్పకాలిక గ్యాస్ ఆధార పథకాలు ప్రారంభం
* రైతులకు 5 హార్స్ పవర్ పంపుసెట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా

ప్రజా విశ్వాసాన్ని చూరగొంటున్న ప్రజా ప్రభుత్వం

DIPR RO No. 230/Advt.I/C2/90-91, dt. 21-2-91